క్లుప్తంగా

ఉపాధి కూలీలకు పే స్లిప్ ఇవ్వాలి

దెందులూరు: ఉపాధి కూలీలకు పే స్లిప్పులు అందజేసి మెడికల్ కిట్లు, మంచినీరు, మజ్జిగ, టెంట్లు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. సోమవారం దెందులూరు మండలంలో పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర అధికారులు అన్ని ప్రదేశాల్లో కూలీల పనుల నాణ్యత మాత్రమే చూస్తున్నారని, వారికి లభించే వేతన బకాయిలు విడుదల చేయలేకపోతున్నారన్నారు. ఉపాధిహామీ పనులు, పంట కాలువల్లో, చెరువుల్లో పూడికతీత పనులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయాలని నిర్ణయించడం ఉపాధి కూలీలకు గండి కొట్టడమేనన్నారు.

విజిటర్ల లిస్టును తనిఖీ చేస్తున్న జేసీ లావణ్యవేణి

దెందులూరు : దెందులూరు నియోజకవర్గ స్ట్రాంగరూమ్ వద్ద సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌కు వచ్చిన వారు ఎవరైనా సరే విజిటర్స్ రిజిష్టర్‌లో విధిగా సంతకం చేయించాలని భద్రతా అధికారులకు రిటర్నింగ్ ఆఫీసర్ హోదాలో ఆదేశాలు ఇచ్చిన సంగతి విదితమే. ఇప్పటికే మూడంచెల భద్రతతో పాటు సీసీ కెమెరాలు, విజిటర్స్ రిజిష్టర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిజిష్టర్‌ను ఆమె పరిశీలించారు.

సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ

పెదపాడు: రైతులకు ప్రభుత్వం పచ్చి రొట్ట ఎరువులను 50శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు రైతు భరోసా కేంద్రంలో జనుము, జీలుగ పిల్లి పెసర విత్తనాలు 50శాతం సబ్సిడీపై రైతులు అందించారు. ఈకార్యక్రమంలో ఏలూరు డివిజన్ ఏడీఏ వై సుబ్బారావు, పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


విద్యార్థులకు బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి జెడ్పీ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు హెచ్‌ఎం ఎస్ వెంకటలక్ష్మి పరివేక్షణలో ఉపాధ్యాయులు పువ్వుల ఆంజనేయులు తదితరులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు ఈ నెల 24 నుంచి నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యేందుకు కృషి చేస్తున్నారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసి పాసైతే విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోకుండా యథాప్రకారం ఇంటర్మీడియట్ చదువుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

24న సాల్వేషన్ ఆర్మీ కల్నల్ దెందులూరు రాక

దెందులూరు: దెందులూరులో 125 ఏళ్ల రక్షణ సైన్య సేవా చరిత్ర కలిగిన దెందులూరు ప్రార్థనా మందిరం పునర్నిర్మాణ కార్యక్రమం ఈ నెల 24న ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు కోర్ ఆఫీసర్ మేజర్ కె.రమణయ్య తెలిపారు. సోమవారం దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ఆయన మాట్లాడుతూ సాల్వేషన్ ఆర్మీ కల్నల్ యాకుబ్ మసీ, కల్నల్ సుమిత్రా మసీ, డివిజనల్ కమాండర్ మేజర్ జల్లి మోషే, మేజర్ జల్లి మేరీ, ఐసీఎం అగ్రిపీ ఠాధిపతులు డాక్టర్ ఎస్‌డీ రాజు, ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు.ప్రార్థనా మందిరం పునర్నిర్మాణ శంకుస్థాపనకు రక్షణ సైన్య అన్ని మండల నాయకులు, సంఘ కాపరులు, సంఘ పెద్దలు, సంఘస్తులు, గృహ సమితి స్త్రీలు, యవ్వనస్థులు హాజరవుతారని మేజర్ రమణయ్య తెలిపారు.

సీనియర్లకు వడ్డీ 8.6 శాతం చెల్లింపు

నిడమర్రు: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ద్వారా 2024 మార్చి నాటికి 10,028 కోట్లు ఖాతాదారులు నుంచి డిపాజిట్ల రూపంలో సేకరించినట్లు ఆ బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం సీజీజీ బ్యాంక్ నిడమర్రు శాఖను నూతన భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 8 జిల్లాల్లో 268 శాఖల్లో రూ.12,500 కోట్ల రుణాలు అందించామన్నారు. సీనియర్ సిటిజన్లకు వడ్డీ 8.6 శాతం చెల్లిస్తున్నామన్నారు. ఏలూరు డివిజన్ పరిధిలో మరో రెండు శాఖలను ప్రారంభిస్తామని తెలిపారు. రీజనల్ మేనేజర్ యు శ్రీదేవి మాట్లాడుతూ తన పరిధిలో రూ.1,495 కోట్లు డిపాజిట్లు సేకరించామన్నారు. నిడమర్రు బ్రాంచ్‌లో లాకర్ సౌకర్యం ఉంటుందన్నారు. బ్యాంక్ మేనేజర్ ఆర్ శ్రీనివాస బాబు, ప్రధాన కార్యాలయం ప్రణాళిక అధికారి అంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

- అందుబాటులో జీలుగు, పిల్లిపెసర, జనుము విత్తనాలు
- 90 శాతం రాయితీపై సరఫరా
- గిరిజన రైతుల హర్షం


పచ్చిరొట్ట పంట


పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు (ఫైల్)

బుట్టాయగూడెం: పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచేందుకు ప్రభుత్వం, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు కృషి చేస్తున్నారు. భూసారం పెంచి పంటలు అధిక దిగుబడులు సాధించే విధంగా పచ్చిరొట్ట సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా గిరిజన ప్రాంతంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల పరిధిలోని గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు అందిస్తుంది. ఈ ఏడాది కూడా రైతులకు పంపిణీ చేయనున్నారు. పచ్చిరొట్ట సాగుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించనున్నారు. పోలవరం నియోజకవర్గంలోని రైతు భరోసా కేంద్రాల్లో 572 క్వింటాళ్ల విత్తనాలను అధికారులు పంపిణీకి సిద్ధం చేశారు. వీటిలో జీలుగు 320 క్వింటాళ్లు, పిల్లిపెసర 52 క్వింటాళ్లు, జనుము 200 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయని, 90 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

పచ్చిరొట్ట సాగుతో మేలు

పచ్చిరొట్ట సాగు చేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. భూమిలో ఉన్న పోషకాలను చేనుకు సమతుల్యంగా అందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. సల్ఫర్, పాస్ఫరస్ భూమిలోని నత్రజని జింక్ వంటి సూక్ష్మ, స్థూల మూలాలన్నీ సమృద్ధిగా ఉంటాయి. చేనుకు కావాల్సిన పోషకాలను అందించడంలో పచ్చిరొట్ట దోహదపడుతుంది. ఎరువుల వినియోగం తగ్గుతుంది. పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల భూమిలో వానపాముల సంఖ్య పెరుగుతుంది. పంటకు ఉపయోగపడే మిత్ర పురుగులు భూమి పొరల్లో వృద్ధి చెందుతాయి.

సాగు ఇలా

వరుసగా మూడు నుంచి ఐదేళ్ల పాటు ఖరీఫ్ పంట వేసుకునే ముందు పచ్చిరొట్ట సాగు చేయాలి. పచ్చిరొట్ట విత్తనాలు వేసిన 30 నుంచి 40 రోజుల మధ్యలో పొలాన్ని దమ్ము, దుక్కి చేయాలి. ఇలా చేయడం వల్ల పచ్చిరొట్ట మొక్కలు దమ్ము మడిలో పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది.

భూసారం పెంపు



పచ్చిరొట్ట పంటల సాగు వల్ల భూసారం పెరుగుతుంది. పంటల్లో పోషకాలు కూడా పెరుగుతాయి. దీనివల్ల పంట అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ప్రతి ఖరీఫ్ సీజన్‌లో గిరిజన రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై విత్తనాలను అందించి, పచ్చిరొట్ట సాగును ప్రోత్సహిస్తుంది.

– డి.ముత్యాలావు, ఏఓ, బుట్టాయగూడెం మండలం

24 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

టి.నరసాపురం: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశామని ఎంఈఓ శ్రీరామూర్తి తెలిపారు. ఈ నెల 24 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని చెప్పారు. సంబంధిత ప్రశ్న పత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచామన్నారు. టి.నరసాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండలానికి సంబంధించిన పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామని, ఇక్కడ 160 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

అందాల హరివిల్లు

జంగారెడ్డిగూడెంలో పట్టణంలో సోమవారం సాయంత్రం ఇంద్రధనస్సు ఆహ్లాదాన్ని పంచింది. ఉరుములు మెరుపులతో ఒక్కసారిగా వాతావరణం మారగా.. ఆకాశంలో ఓ దిక్కు నుంచి మరో దిక్కుకు రెండింటిని కలుపుతూ హరివిల్లు విరిసింది. పట్టణంలో కనిపించిన ఈ ఇంద్రధనస్సును ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

–జంగారెడ్డిగూడెం



22న నృత్య సంగీత ధ్యాన యజ్ఞం

జంగారెడ్డిగూడెం: స్థానిక శేషాద్రినగర్‌లోని మైత్రేయ మందిర ప్రాంగణంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా 22న సాయంత్రం బుద్ధపౌర్ణమి నృత్య సంగీత ధ్యాన యజ్ఞం నిర్వహిస్తున్నట్టు ది జంగారెడ్డిగూడెం పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం సాయంత్రం చిన్నారులచే నృత్య ప్రదర్శన, జంగారెడ్డిగూడెంకు చెందిన సంగీత శిక్షకురాలు మల్లాది పర్వత వర్ధని శిష్యబృందంచే శ్రీరామ గానామృతం, అన్నమయ్య తత్వంతో శాస్త్రీయ సంగీత కచేరీ, ధ్యానుల సామూహిక ధ్యానం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం నిర్వహించే శాకాహార అల్పాహార విందులో అందరూ పాల్గొనాలని పేర్కొంది.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం

పెదవేగి : పార్టీ కోసం కష్టపడిన ప్రతి వ్యక్తికి అండగా నిలిచి, ఆదుకుంటామని ముండూరు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆ పార్టీ శ్రేణులకు అభయమిస్తున్నారు. పెదవేగి మండలం ముండూరు పంచాయతీ వెంగంపాలెం గ్రామ బూత్ కన్వీనర్ యర్రా శేఖర్ మోటార్‌సైకిల్‌పై నుంచి పడిపోయి గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బలుసు శేఖర్, పోలేపల్లి రత్తయ్యచౌదరి సోమవారం శేఖర్‌ను పరామర్శించారు.

టంగుటూరి సేవలు చిరస్మరణీయం

భీమడోలు: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయులని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో కొనసాగాయి. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేశారు.

వైభవంగా నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు


నూకాలమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారి ఆలయ పంచమ వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణం, ప్రతిష్ఠ పూర్తిచేసి ఐదేళ్లు పూర్తిచేస్తున్న సందర్భంగా అమ్మవారికి 108 కళశాలతో విశేష కలశ పూజ, అమ్మవారి మూల మంత్రాలతో విశేష హోమాలు చేసి పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు మనోజ్‌శర్మ బృందం మూలవిరాట్‌కు పంచామృతాలు, పుణ్య నదీ జలాలు, వివిధ ఫల రసాలు, విశేష ద్రవ్యాలతో జలాభిషేకలు చేశారు. ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం వార్షికోత్సవాలను గురించి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఈమని శశికుమార్ శర్మ వివరించారు. ఆలయ చైర్మన్ రాజాన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతోసుభిక్షంగా ఉండాలని ఏటా జలాభిషేకాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 22న సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమయ్యే 63వ చండీ హోమాన్ని తిలకించేందుకు భక్తులంతా పాల్గొనాలని కోరారు. జంగారెడ్డిగూడెం కమిషనర్‌గా పనిచేసిన పి.భవానీ ప్రసాద్ దాతృత్వంతో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ


సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కొదమ జ్యోతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు సబ్సిడీలు, పథకాలను వివరించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. లక్కవరం హైస్కూల్‌లో హిందీ టీచర్ పోస్టును భర్తీ చేయాలని ఎంపీటీసీ దల్లి మోహన్ రెడ్డి, దేవులపల్లిలో వీధి దీపాలకు మరమ్మతులు నిర్వహించి, పనిచేసేలా చేయాలని ఎంపీటీసీ ప్రగడ వెంకట లక్ష్మి కోరారు. కోఆప్షన్ సభ్యుడు లాల్ అహ్మద్ మాట్లాడుతూ తిరుమలాపురం గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. లైన్‌మెన్ లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కేతవరంలో లైన్‌మెన్‌ను నియమించాలని వైస్ ఎంపీపీ నరెడ్ల బుచ్చిబాబు కోరారు. ఎంపీపీ జ్యోతి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని పనిచేస్తూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి దిశగా ముందుకెళ్లాలన్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అంగన్‌వాడీలకు వచ్చిన నిధులు సకాలంలో వినియోగించకపోతే ఆ నిధులు వెనక్కెళ్లే అవకాశం ఉందని, నిధులు వినియోగానికి ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ కె.విజయ్ ప్రసాద్ పాల్గొన్నారు.


వైఎంహెచ్‌ఏ సెంటర్‌లో జాతీయ నాయకుల గురించి వివరిస్తున్న రిసోర్స్ పర్సన్


వంగాయగూడెం శిబిరంలో నీతి కథలు బోధిస్తున్న రిసోర్స్ పర్సన్


వివిధ చిత్రాల ఆకృతులను తయారు చేయడం నేర్పుతున్న శిక్షకురాలు

విజ్ఞానం.. వినోదం

- ఐదేళ్లుగా వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణ
- విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసే ప్రయత్నం
- హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరులో ప్రత్యేక కార్యక్రమాలు


పేపర్లతో చిత్రాల తయారీ విధానాన్ని నేర్పుతున్న శిక్షకుడు

ఏలూరు (టూటౌన్): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడంతో పాటు వారికి విజ్ఞానం, వినోదం పెంపొందించే విధంగా వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తోంది హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్. గత ఐదేళ్ల నుంచి హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఆటపాటలు, చిత్రలేఖనం, వస్తువుల తయారీ, చెస్, డాన్స్, మ్యాథమెటిక్స్ ట్రిక్స్, దేశ జాతీయ నాయకుల జీవిత విశేషాలను ప్రొజెక్టర్ ప్రజంటేషన్ ద్వారా వివరించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. విద్యతో పాటు సమాజంలో అనేక సామాజిక అంశాల పట్ల అవగాహన కల్గిస్తోంది. మూఢనమ్మకాలను పారద్రోలుతూ సైన్స్ భావజాలం పెంపొందించే విధంగా ఈ శిబిరాలను నిర్వహిస్తోంది.

20 ప్రాంతాల్లో శిక్షణ

హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ ఈ ఏడాది ఏలూరు నగరంలో 20 ప్రాంతాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. గన్ బజార్, వంగాయగూడెం, పోణంగి వైఎస్సార్ కాలనీ, బాలల గ్రంథాలయం, జిల్లా కేంద్ర గ్రంథాలయం, శనివారపు పేట, సుందరయ్య కాలనీ, తంగెళ్ళమూడి, గాంధీనగరం, అల్లూరి సీతారామరాజు కాలనీ వంటి ప్రాంతాల్లో ఈ శిక్షణ శిబిరాలు నడుపుతోంది.

శిక్షణలో ప్రత్యేక అంశాలు

విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలిగించే విధంగా ఆటలు, పాటలు, డాన్స్, కోలాటం, డ్రాయింగ్, బెస్ట్‌ఫ్రం వేస్ట్ వంటివి నేర్పుతున్నారు. ఆడపిల్లలకు ఆత్మ రక్షణకు ఉపయోగపడే కరాటే, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి సెల్ఫ్ టెక్నిక్స్ నేర్పుతున్నారు. సమాజ శ్రేయస్సుకు పాటుపడిన దేశ స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకులు, సంఘ సంస్కర్తలు, మహనేతల జీవిత చరిత్ర విశేషాలను వీడియోల ద్వారా పిల్లలకు వివరిస్తున్నారు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించడం, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించే విధంగా పిల్లల్లో ఆలోచన కలిగిస్తున్నారు. చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరాలకు ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం తదితర ప్రజా సంఘాలు సహకరిస్తున్నాయి.

విజ్ఞానం పెంపొందించే దిశగా..



హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నాం. శిబిరాల్లో విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానం పెంపొందించే దిశగా కార్యక్రమాలు రూపొందిస్తున్నాం. శిబిరాల నిర్వహణకు నగరంలోని వివిధ ప్రజా సంఘాల సహకారం తోడ్పాటు అందిస్తున్నాయి.

– పి.దుర్గాప్రసాద్, హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి, ఏలూరు

మూఢ నమ్మకాలను పారదోలేలా..



శిబిరాలకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరవుతున్నారు. ఆట, పాటలతో పాటు, కథలు, కవితలు వంటివి నేర్పిస్తున్నాం. నీతి కథలను చిన్నారులు ఎంతో ఆసక్తిగా వింటున్నారు. చిన్నతనంలోనే మూఢ నమ్మకాలను పారదోలేవిధంగా సైన్స్‌తో కూడిన విజ్ఞానాన్ని పెంపొందించేలా చేస్తున్నాం.

– యు.దుర్గ, ఎస్ఎఫ్ఐ గరల్స్ విభాగం కన్వీనర్, ఏలూరు

స్పందన బాగుంది



వేసవి సెలవుల్లో విద్యార్థులకు పలు అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నాం. సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా వారిలో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేలా వివిధ అంశాల్లో శిక్షణ అందిస్తున్నాం. విద్యార్థుల్లో స్పందన బాగుంది. ఈ ఏడాది 20 ప్రాంతాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం.

– వి.ఠాగూర్ రాజా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు

కర్రసాముతో ఆరోగ్యం, ఆత్మరక్షణ


శిబిరంలో పాల్గొన్న వివిధ సంస్థ ప్రతినిధులు, శిక్షకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కర్రసాము శారీరక ఆరోగ్యంతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం హేలాపురి బాలోత్సవం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఏఆర్‌డీజీకే హైస్కూల్‌లో ఆయా కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నాయకులు కె.కృష్ణమాచార్యులు కర్రసాము చేసి కర్రసాములో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యుడు పి.ఆంజనేయులు మాట్లాడుతూ శిక్షణ శిబిరానికి సమన్వయకర్తగా కె.శ్రీనివాసరావు వ్యవహరిస్తారని తెలిపారు. మాస్టర్స్ జోగా చంద్రశేఖర్, జోగా మోహన్ రావు కర్రసాములో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ సెల్ జిల్లా సభ్యుడు మేతర అజయ్ మాట్లాడుతూ శరీర దారుఢ్యం, మానసిక ధైర్యం పెంపొందించుకోవడానికి కర్రసాము ఉపయోగపడుతుందని చెప్పారు. మే 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు కొనసాగే ఈ శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్సై ఎం మిల్టన్, ఎన్వీ గంగాభవాని, పి.దుర్గాప్రసాద్, సీహెచ్ జగదీష్, పి.అనురాధ, మేతర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం


ఘంటా ప్రసాదరావు

దెందులూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించడం తథ్యమని, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు అన్నారు. సోమవారం దెందులూరులోని విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి నివాసంలో ఆయన మాట్లాడారు. గతంలో ఏ రాష్ట్రంలోనూ, ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలతో పాటు పేదలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి, భద్రత, భవిష్యత్తును కల్పించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. మహిళలకు, దళిత, బీసీ, గిరిజనులకు పదవులు కేటాయించి ఉన్నత స్థానాల్లో కూర్చోపెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు, నవరత్నాల పథకాలతో పాటు సంక్షేమం, అభివృద్ధి లబ్ధిని నేరుగా అర్హుల గడప వద్దకే వలంటీర్ల ద్వారా అందజేసిన ముందు చూపుతున్న నాయకుడు వైఎస్ జగన్ అని ప్రసాద్ అభివర్ణించారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ నేడు దేశానికి ఆదర్శకంగా నిలిచిందన్నారు. కుల, మత, వర్గ, ప్రాంత, పార్టీ వివక్షత లేకుండా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలు అర్హులందరికీ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళలతో పాటు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని పెద్ద ఎత్తున మద్దతునిచ్చి ఆశీర్వదించారన్నారు.